

మైదుకూరు కమిషనర్‌గా రంగస్వామి



మైదుకూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మైదుకూరు నూతన కమిషనర్‌గా రంగస్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వ హిస్తున్న ఇయన బదిలీపై మైదుకూరు కమిషనర్‌గా వచ్చారు. గతంలో మైదుకూరు ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేశాన ని, ఆ అనుభవంతో ఇక్కడ ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని ఆయన అన్నారు.

మెగా డీఎస్సీ ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 తుది ఎంపిక జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలు ఏర్పాట య్యాయి. జోనల్ కమిటీ తీర్పుపై అసం తృప్తి ఉంటే రాష్ట్ర కమిటీకి, అక్కడి నిర్ణ యంపై కూడా అసంతృప్తి ఉంటే తుది అప్పీల్ కోసం పాఠశాల విద్యా సంచాల కులను సంప్రదించవచ్చని డీఎస్సీ కన్వీనర్ ఎవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులను తప్పనిసరిగా అక్టోబరు 25లోపు సమర్పించాలని సూచించారు.

పబ్లిక్ హెల్త్ ప్రక్షాళనకు చర్యలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంటు ప్రక్షాళనకు అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, రెవెన్యూ ఆఫీసర్ డేనియల్ జోసఫ్, డీఈ రాజేశ్‌లు నాలుగు డివిజన్ల కార్యాలయాల్లో వర్కర్లను అక్కడికి రమ్మని డివిజన్ కార్యాలయాల్లో మస్టర్ తీసుకున్నారు. దీంతో ఏకంగా 45 మంది పర్మినెంట్ ఆప్కాస్ వర్కర్లు బదిలీలు పెటుకొన్న విషయం గుర్తించారు. వారితో పాటు తాత్కాలిక పద్ధతిన కొవిడ్‌లో తీసుకున్న వర్కర్లు కూడా మరో పదిమంది బదిలీ పెట్టుకొన్నారు. వారందరిని సర్టిఫికెట్లు తీసుకుని రమ్మని చెప్పి పరిశీలించారు. వారిలో ఆరోగ్యం బాగాలేని వారికి మాత్రం బదిలీకి అవకాశం ఇస్తామని మిగిలిన వారు తప్పనిసరిగా పారిశుధ్య పనులకు వెళ్లాలని చెప్పారు. ప్రొద్దుటూరులో పారిశుధ్యం మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన లక్ష్యంతో తాము ఈ చర్యలకు శ్రీకారం చుట్టామని కమిషనర్ తెలిపారు. ప్రతిరోజు ఇక నుంచి డివిజన్ కార్యాలయాల పరిధిలో మస్టర్‌ను పరిశీలిస్తామన్నారు. అక్కడ సీసీ కెమెరాల పర్యవేక్షణ కూడా పెడతామన్నారు. డివిజన్ పరిధిలోని శానిటరీ సెక్రటరీలు డివిజన్ కార్యాలయం వద్దకే రావాలన్నారు. అక్కడి నుంచే ఎక్కడ పారిశుధ్య పనుల ఆవశ్యకత ఉందో అక్కడి వెళ్లి పనిచేయించాల్సి ఉంటుందన్నారు.

రబీకి సమాయత్తం



రబీ సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్న అన్నదాతలు

- 1,40,000 హెక్టార్లలో సాగు లక్ష్యం
- 41,590 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు

కడప రూరల్ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ మరో 5 రోజుల్లో ముగిసి 2025-26 రబీ సీజన్ ప్రారంభం కాబోతోంది. దీంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు రబీ యాక్షన్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ర బీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు 41,590 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు చేసింది. అలాగే రబీ సాగుకు అవసరమైన 70 వేల టన్నుల ఎరువులను దశల వారీగా మంజూరుకు చర్యలు చేపట్టింది. రబీ సాగుకు అవసమైన వర్షాలు సంవృద్ధిగా కురుస్తుండడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. మరోవైపు అధికారులు రబీ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు అన్నదాతలకు అందించే పనిలో బిజీగా ఉన్నారు.

లక్ష హెక్టార్లలో శనగపంట

2025-26 రబీ సీజన్‌కు సంబంధించి 1,40,000 హెక్టార్లలో పంటలను సాగు చే యాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ప్రధానంగా శనగ పంట లక్ష హెక్టార్లలో సాగుకానుంది. వేరుశనగ, మినుము, నువ్వు, పెసర, వరి తదితర పంటలను మిగిలిన 40వేల హెక్టార్లలో సాగు చేయనున్నారు.

ధరలు ఖరారు కాగానే పంపిణీ

రబీ పంటల సాగు కోసం జిల్లాకు మంజూరైన శనగ, వేరుశనగ, మినుము, పెసర, నువ్వులు విత్తనాల పంపిణీకి అధికారులు సంసిద్ధమయ్యారు. ప్రభుత్వం నుంచి విత్తనాల ధరలు ఖరారు కాగానే ఆయా మండల కేంద్రాలలోని పంపిణీ కేంద్రాలకు తరలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు అందజేయనున్నారు.

41,590 క్వింటాళ్ల విత్తనాలు

జిల్లాలో రబీ సీజన్ కింద సాగయ్యే పలు రకాల పంటలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 41,590 క్వింటాళ్ల విత్తనాలను మంజూరు చేసింది. శనగలు 37,641 క్వింటాళ్లు, వేరుశనగ 2830 క్వింటాళ్లు, మినుములు 857, పెసర 187, నువ్వులు 75 క్వింటాళ్ల మేర మంజూరు అయ్యాయి. అయితే రబీలో శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. దీంతో అదనంగా మరో 5 వేల క్వింటాళ్లను మంజూ రు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది.

శిక్షణకు సన్నాహాలు



డీటీసీ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. శిక్షణ కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, తరగతి గదులను కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ డీటీసీ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, సిబ్బంది ఉన్నారు.

అందరి సహకారంతో నగరాభివృద్ధి

● ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం



బాధ్యతలు స్వీకరిస్తున్న ముంతాజ్ బేగం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో కడప కార్పొరేషన్ అభివృద్ధికి కృషిచేస్తానని ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం పేర్కొన్నారు. కడప మేయర్ పదవి ఖాళీ కావడంతో ప్రభుత్వం డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగాన్ని ఇన్‌చార్జి మేయర్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె మేయర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్యూటీ మేయర్‌గా ఉన్న తనను ఇన్‌చార్జి మేయర్‌గా నియమించడం సంతోషకరమని అయితే సురేశ్‌బాబును మేయర్ పదవి నుంచి తొలగించడం బాధాకరమన్నారు. రవీంద్రనగర్‌లో అభివృద్ధి చేసినట్లే మొత్తం నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పెండింగ్ పనులను పూర్తిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, మాజీ మేయర్ సురేశ్‌బాబు ఇన్‌చార్జి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన ముంతాజ్ బేగంకు శుభాకాంక్షలు తెలిపారు.

జీఎస్టీపై అవగాహన పెంచాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై నెలరోజుల పాటు నిర్వహించాల్సిన సెలబ్రేషన్స్, సీజనల్ కండిషన్స్, పీఎం కుసుమ్, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూములు సంబంధిత అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, జిల్లా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి సుమతి, కేఎంసీ కమిషనర్ మనోజ్ రెడ్డి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. ఇంటింటికి వెళ్లి జీఎస్టీ తగ్గింపు వలన సేవింగ్స్ గూర్చి ప్రజలకు తెలపాలన్నారు. 29 వరకు ఇంటింటికి వెళ్లి తగ్గిన ధరల వివరాలను తెలపాలన్నారు. అనంతరం అక్టోబరు 6 వరకు వ్యవసాయం ఇతర వృత్తులు, 7 నుంచి 13 వరకు విద్య, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితరాలు, 14 నుంచి 18 వరకు టూరిజం, సేవారంగం, రెన్యూబుల్ ఎనర్జీ, ఆటో మొబైల్స్ తదితరాలు, 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దీపావళి వేడుకలతో గొప్ప ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. నూతన జీఎస్టీ, తగ్గిన ధరలు, పేదవర్గాలకు జరిగే మేలుతో పాటు వ్యాపార వర్గాలకు పెరిగే అమ్మకాలకు సంబంధించి విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

వాహనాలపై దాడి ఘటనలో11 మందిపై కేసు నమోదు

కడప క్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కడప నగరం నానాపల్లి క్వారీ వద్ద టిప్పర్, హిటాచి వాహనాలపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేసిన ఘటనలో 11మందిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు కడపకు చెందిన టీడీపీ నేత రాజగోపాలరెడ్డి తన అనుచరులతో కలిసి బుధవారం క్వారీ వద్దకు వెళ్లి అక్కడున్న టిప్పరు, హిటాచి అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో టిప్పర్ యజమాని ఫిర్యాదు మేరకు రాజగోపాలరెడ్డితో పాటు మరో పదిమందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పండగపూటా పస్తులేనా?

● సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల ఆవేదన
● రెండు నెలలుగా జీతాలు అందని వైనం



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొన్నా.. కొన్ని ఇళ్లలో మాత్రం వెలుగు కన్నా వెలితి కనబడుతోంది. పాఠశాలల్లో పిల్లలకు చదువు చెబుతూ వారి భవిష్యత్తు తీర్చిదిద్దే సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు రెండు నెలలుగా జీతం రాక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ బిల్లులు, ఇళ్ల అద్దెలు, పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు అన్నీ బాకీ పడుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ కింద సుమారు 279 మందికి పైగా ఒప్పంద ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ప్రత్యేక శిక్షకులు, రీసోర్స్ టీచర్లు, ఐటీ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కాంట్రాక్ట్ బేసిస్ కోఆర్డినేటర్లు ఉన్నారు. వీరి సేవలు విద్యా వ్యవస్థకు అనివార్యమైనవే. సాధారణంగా వీరి నెల జీతాలు రూ.15వేల నుంచి రూ.25వేల మధ్య ఉంటాయి. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనం రావాలి. కానీ ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలు ఇంకా విడుదల కాలేదు. దీనితో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని ప్రభావం కుటుంబంపై పడుతోంది. దసరా సెలవుల నేపథ్యంలో ఇళ్లవద్ద ఉండే పిల్లలకు సరైన తిండి కూడా పెట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ రుణాలు తీసుకొని ఇంటి ఖర్చులు తీర్చాల్సి వస్తోందని వారు అంటున్నారు. పండగపూటైనా ప్రభుత్వం జీతాలు చెల్లిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

సోమవారం జీతాలు చెల్లిస్తాం

సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న అందరికి ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన జీతాలు రాలేదు. దీనిపై రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడగా బిల్లు పెట్టుకోమని సూచించారు. ఈ నేపథ్యంలో సోమవారం జీతాలు చెల్లించే అవకాశం ఉంది.

- నిత్యానందరాజులు, సమగ్ర శిక్ష జిల్లా అధికారి

డ్రైనేజీలో భారీ మంటలు

● తప్పిన పెనుప్రమాదం



హెచ్‌బీ పెట్రోల్ బంక్ వద్ద డ్రైనేజీలో వస్తున్న మంటలు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో శుక్రవారం సాయంత్రం డ్రైనేజీలో భారీగా మంటలు వచ్చాయి. దీంతో సమీపంలో ఉన్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. అయితే అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వివరాలిలా..

ఎర్రగుంట్ల-ముద్దనూరు రోడ్డులో హెచ్‌బీ పెట్రోల్ బంకు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు బంకు చుట్టూ భారీగా నీరు చేరింది. దీంతో వారంరోజులుగా బంకును మూసేశారు. బంకులోని డీజల్, పెట్రోల్ ట్యాంకులు నీటితో కలుషితమయ్యాయి. వీటిని పరిశీలించిన సదరు హెచ్‌బీ యాజమాన్య ప్రతినిధులు మళ్లీ వస్తామని వెళ్లారు. అయితే ట్యాంకుల వద్ద నుంచి నీరు ఓవర్ ఫ్లో అయ్యి ముద్దనూరు రోడ్డులో ఉన్న డ్రైనేజీలోకి చేరింది. దీనికి తోడు చుట్టూ ఉన్న నీటిని బంక్ వారు పంపింగ్ చేయడంతో డ్రైనేజీలోకి మరింతగా వెళ్లింది. ఈ నీటిలో పెట్రోలు, డీజిల్ కలిసింది. ఈ విషయం తెలియక గుర్తుతెలియని వారు అగ్గిపుల్ల వేయడమో లేక వేడికి వాటంతట అవే రగిలి డ్రైనేజీ ఓపెన్ ఉన్న చోట శుక్రవారం సాయంత్రం బాంబులు పడ్డాయా అన్నంతగా పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కలున్న ప్రజలు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. దట్టమైన పొగ మేఘంలా కమ్ముకుంది. వెంటనే అప్రమత్తమైన పెట్రోల్ బంకువారు గ్యాస్ ఫైర్‌తో మంటలను, పొగను నియంత్రించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ విశ్వనాథరెడ్డి, ఏఎస్ఐ రాజారెడ్డి బంకు వద్దకు వెళ్లి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బంకు యజమానులతో మాట్లాడారు. కలుషిత నీటిని డ్రైన్‌లోకి ఎలా పంపింగ్ చేస్తారని ప్రశ్నించారు. ఇకపై జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఏది ఏమైనా పెనుప్రమాదమే తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పెరిగిన స్త్రీశక్తి

● ఉచిత ప్రయాణంతో మహిళలకు ఆర్థిక భరోసా
● 29,17,348 మంది మహిళల ప్రయాణం ● వారికి రూ.13.31 కోట్ల లబ్ధి



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

(కడప-ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లాలో సూపర్‌హిట్ అవుతోంది. స్త్రీశక్తి పేరిట ఈ పథకాన్ని ఆగస్టు 15న ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని మహిళలు విశేషంగా ఉపయోగించుకుంటున్నారు. జిల్లాలో పల్లెవెలుగు, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. 462 బస్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ పథకం అమలు కాకముందు ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేటు 72శాతం ఉండేది. ఇప్పుడు 90 శాతం దాకా చేరుకుంది.

గత నెల 15 నుంచి ఈ నెల 24 వరకు మహిళా ప్రయాణికుల వివరాలు

డిపో	మహిళల సంఖ్య	టికెట్ల విలువ రూ.లలో
కడప	4,46,898	2,56,95,775
పులివెందుల	5,61,621	2,66,27,255
బద్వేలు	3,51,398	1,70,80,620
జమ్మలమడుగు	3,25,674	1,37,42,330
మైదుకూరు	3,59,555	1,41,39,080
ప్రొద్దుటూరు	8,72,202	3,58,74,540
మొత్తం	29,17,348	13,31,59,600

మహిళలకు ఆర్థిక భరోసా

ఉచిత బస్సు పథకం మహిళలకు ఆర్థిక భరోసాగా మారింది. వివిధ పనుల నిమిత్తం ప్రయాణించే మహిళలే కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు, పట్టణాల్లో, ఇతర ప్రాంతాల్లో పనులకు వెళ్లే కార్మికులు.. ఇలా అందరికీ ఉపయోగపడుతోంది. ఉద్యోగస్తులు అయితే సెలవు రోజులు మినహాయిస్తే మిగతా పనిదినాల్లో విధులకు హాజరు కావాల్సి ఉంది. బస్ చార్జీలు ఎంత లేదన్నా దూరం బట్టి రూ.50 వరకు చెల్లించాల్సి ఉండేది. రాను పోను రూ.100 చెల్లించే వారు ఉంటారు. ఇప్పుడు ఉచిత బస్సుతో ఆ భారం తగ్గిపోయింది. ఆగస్టు 15న పథకం ప్రారంభమైంది. ఈ నెల 24 నాటికి జిల్లావ్యాప్తంగా 29,17,348 మంది మహిళలు ప్రయాణించారు. ఈ టికెట్ల విలువ రూ.13,31,59,600లుగా ఉంది. ఈ సొమ్మును ప్రభుత్వం భరిస్తుంది.

కడప ప్రభుత్వ ఆసుపత్రి ఆర్‌ఎంవో పెంచలయ్యపై విచారణ

● నెల్లూరు డీఎంహెచ్‌ఓగా భారీ అక్రమాలు

కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప 300 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్యశాల రెసిడెంట్ వైద్యాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్యపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నం జోన్-1 రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణిని విచారణాధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు నెలల్లోగా విచారణను ముగించి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది. నెల్లూరు జిల్లా ఆరోగ్య వైద్యాధికారిగా పనిచేసే సమయంలో పెంచలయ్య భారీగా అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. ఈ ఆరోపణలపై సంజాయిషీ చెప్పుకునేందుకు ఆయనకు అవకాశం కల్పిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 24న నోటీసులు జారీ చేసింది. మార్చి 6న ఆయన సమర్పించిన సంజాయిషీలతో సంతృప్తిపడని ప్రభుత్వం చివరికి విచారణకు ఆదేశించింది. నెల్లూరులో అక్రమాలకు పెంచలయ్య పూర్తి బాధ్యుడుగా ప్రభుత్వం నిర్ధారించింది. ఆరోపణలపై లోతుగా విచారణ చేయించి వాస్తవాలు నిగ్గుదేల్చాలని నిర్ణయించింది.

రాజరాజేశ్వరీ పాలయమాం



జమ్మలమడుగులో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో వనవిహారిణిగా..



స్కందమాత అలంకారంలో విజయదుర్గాదేవి

కడప కల్చరల్/జమ్మలమడుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రకృతి స్వరూపిణి అయిన అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జమ్మలమడుగులో కన్యకాపరమేశ్వరి దేవి, కడప లలితా పంచాయతన దేవాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో స్కందమాతగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో మోహినీదేవి రూపంలో భక్తులను కటాక్షించారు. దేవుని కడప లక్ష్మీవెంకటేశ్వరుని ఆలయంలో స్వామివారు శుక్రవారం గరుడవాహనంపై భక్తులను అనుగ్రహించారు.



లలితా పంచాయతన దేవాలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు



పత్తిపంటకు పిచికారి చేస్తున్న రైతు

రైతన్నలూ.. జర భద్రం

● క్రిమిసంహారక మందుల పిచికారీతో అప్రమత్తత అవసరం

● అధికారుల సూచనలు పాటించండి ● నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందులు అంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. అవి మన శరీరంలోకి వెళ్లినా, వాటి వాసనను పీల్చినా ఆరోగ్యానికి హానికరం. పంటలపై పురుగు మందులు పిచికారి చేయడంలో అవగాహన లేకపోవడం, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలతో రైతులు, వ్యవసాయ కూలీలు అనారోగ్యానికి గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలను ఆశించే చీడపీడల నివారణకు లేదా కలుపు నివారణకు మందులు పిచికారి చేస్తున్నారు. ఆ సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

క్రిమి సంహారక మందులు పిచికారి చేయడానికి వ్యవసాయశాఖ సూచించిన స్ప్రేయర్లు (పరికరాలు) మాత్రమే వాడాలి. పంట స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లకన్నా, తైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కలపై నేరుగా మందును పిచికారి చేయవచ్చు.

అవగాహన అవసరం

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగుమందులపై రైతులు అవగాహనను పెంచుకోవాలి. సంబంధిత దుకాణాల్లో నాలుగు రంగుల్లో పురుగుమందులు లభ్యమవుతున్నాయి. వీటిలో ఏవి విషపూరితమైనవి అనే విషయాన్ని తెలుసుకోవాలి. పుర్రెగుర్తుతో ఆకుపచ్చ, నీలి, పసుపురంగులతో కూడిన డబ్బాలు ఉంటాయి. పుర్రెగుర్తుతో కూడిన ఎర్రరంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నం ఉంటే తక్కువ విషపూరితమైనవని రైతులు తెలుసుకోవాలి.

మందు ప్రభావానికి గురైతే...

పురుగుమందుల ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి. మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య వస్త్రం ఉంచాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటికప్పి వెచ్చగా ఉంచి సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలను వైద్యులకు తెలియజేయాలని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- పురుగుమందు డబ్బా మూతను నోటితో తీయవద్దు, మందు ద్రావణాన్ని చేతితో కలపవద్దు. అవసరమైన మందు ఒకేసారి కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయవద్దు. పిచికారి సన్నగా తుంపర్లు పడేలా చూడాలి.
- మందు తగిన మోతాదులోనే పిచికారి చేయాలి. మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు, లేదా మూడు రకాల పురుగుమందులు కలిపి పిచికారి చేయవద్దు.
- చేతులకు గ్లౌజులు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు ధరించాలి. పత్తిపంటలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
- ఉదయం, సాయంత్రం గాలివీస్తున్న సమయంలో వెళ్లి పిచికారి చేయాలి.
- పురుగు మందుల పిచికారి సమయంలో పొగతాగరాదు, గుట్కాలు తినవద్దు.
- గాయాలైన చేతులతో మందుపిచికారి చేయకూడదు. పిచికారి పూర్తి అయిన వెంటనే కాళ్లు చేతులు డెటాల్‌తో శుభ్రంగా కడుక్కోవాలి.
- చిన్నపిల్లలకు పురుగుమందులను సాధ్యమైనంత దూరంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.
- పిచికారి అనంతరం వినియోగించిన పురుగుమందుల డబ్బాలను గొయ్యితీసి పాతిపెట్టాలి.

'అగ్రిసెట్'లో సాయిప్రశాంత్‌కు రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు



కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలికిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో అత్యున్నత అగ్రిసెట్ ర్యాంకు సాధించాడు. 2025-26 విద్యా సంవత్సరానికి వ్యవసాయ గ్రాడ్యుయేట్ కోర్సు (ఏజీబీఎస్సీ) లో ప్రవేశాల కోసం నిర్వహించిన అగ్రిసెట్‌లో స్థానిక వ్యవసాయ పాలి టెక్నిక్ కళాశాల విద్యార్థి ఎ.సాయి ప్రశాంత్ 5వ ర్యాంకు సాధించాడు. కడప జిల్లా దువ్వూరు మండలం రామ్‌సాయినగర్‌కు చెందిన ప్రభాకర్, లక్ష్మీదేవి (రైతు కుటుంబం) దంపతుల కుమారుడైన సాయిప్రశాంత్ కలికిరిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తిచేసి అగ్రిటెక్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకు చేజిక్కించుకున్నాడు. సాయి ప్రశాంత్‌ను ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆర్టీసీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

● ఎండీ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

జమ్మలమడుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేసి లాభాల బాటలోకి తీసుకెళ్లాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సూచించారు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణాన్ని ఆయన సందర్శించారు. ముందుగా ఆర్టీసీ డిపో ప్రాంగణం పరిశీలించారు. ప్రయాణికులకు మౌలిక వసతులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై మాట్లాడారు. అక్కడి నుంచి డిపో గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 1997లో తాను కడప జిల్లా ఎస్పీగా పనిచేశానన్నారు. అప్పట్లో అప్పట్లో ఇరుకైన రోడ్లు, ఇంత అభివృద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నామని, వచ్చే మూడేళ్లలో అన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం విజయవంతమైందని, అందుకు ఆర్టీసీలో పనిచేస్తున్న మెకానిక్‌లు, సిబ్బంది కృషి ఉందన్నారు. డిపో నుంచి బస్సు బయటికి వెళ్లేటప్పుడు బస్సు కండీషన్‌ను మెకానిక్‌లు బాగా చూసి పంపిస్తే... ప్రయాణికులు క్షేమంగా గమ్యస్థానం చేరి సంస్థకు మంచి పేరు వస్తోందన్నారు. జమ్మలమడుగు డిపోలో ప్రస్తుతం 88 బస్సులు ఉన్నాయని, కొత్త బస్సులు వచ్చేదాకా ఉన్న బస్సులనే జాగ్రత్తగా కండీషన్‌లో నడపాలన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాయలకులు టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఇంకా ఏపీఎస్ఆర్‌ఏసీ, ఏపీఎస్ఎమ్‌డీసీ, ఏపీ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ లెక్చరర్‌గా, సెంట్రల్ గవర్నమెంట్ ఓఎన్ జీసీ, జీఏఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బీపీఎల్, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నృత్య, సంగీత కోర్సులలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలోని లలితకళల శాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు, సర్టిఫికెట్ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలను ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ అక్టోబరు 18వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పదేళ్ల వయసు నిండిన వారి నుంచి తర్వాత ఏ వయసు వారైన ఈ కోర్సుల్లో చేరవచ్చని చెప్పారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇడియు.ఇన్‌ను సంప్రదించాలన్నారు. అలాగే 9032595101 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఉద్యోగులు, కళాకారులు ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ప్రశాంతంగా గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో తాత్కాలిక ప్రతిపాదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, టౌన్‌ప్లానింగ్ విభాగాలకు సంబంధించి నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగాయి. అభ్యర్థుల అర్హతలు, బోధన నైపుణ్యం, అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన గెస్ట్ ఫ్యాకల్టీ జాబితాను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్ఎస్)లో 2025-26 విద్యాసంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడిట్ తరగతుల ప్రవేశాల గడువు అక్టోబరు 31 వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 14ఏళ్లు నిండిన వారు పదవ తరగతిలో, 15ఏళ్లు పైబడిన వారు లేదా టెన్త్ పాసైన వారు ఇంటర్మీడియట్‌లో చేరవచ్చన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్ స్కూల్.ఏపీ.జీఓవి.ఇన్ లేదా సమీప స్టడీ సెంటర్‌ను సంప్రదించ వచ్చని తెలిపారు.

సీబీఆర్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం నింపేందుకు చర్యలు



సీబీఆర్‌లోకి విడుదలవుతున్న నీరు

లింగాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)లో గరిష్ఠ నీటిమట్టం 10 టీఎంసీల మేర నింపేందుకు నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల జరిగిన మంత్రివర్గం సమావేశంలో ప్రాజెక్టులను, చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించడంతో ఆ మేరకు సీబీఆర్‌కు గండికోట నుంచి ఎత్తిపోతల ద్వారా నీటి విడుదలను అధికారులు పెంచారు. పీబీసీ ఈఈ వెంకటరామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సీబీఆర్‌లో 7.4టీఎం సీలు ఉన్నాయని, గండికోట ప్రాజెక్టు నుంచి మూడు మోటర్లతో 1400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల ద్వారా విడుదల చేస్తున్నామని, పూర్తిస్థాయిలో ప్రాజెక్టులో నింపుతామని తెలిపారు.

వార్డు కార్యదర్శికి రెండేళ్ల సెలవు మంజూరు

కలికిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బుడ్డాయపల్లె వార్డు అమెనిటీస్ కార్యదర్శి కె.జ్యోతిర్మయికి రెండేళ్ల అసాధారణ సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె వ్యక్తిగత పనుల మీద సౌదీ అరేబియా వెళ్లడానికి అనుమతించింది. తన భర్త దగ్గరకు వెళ్లడం కోసం జ్యోతిర్మయి చేసుకున్న దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి 2027 సెప్టెంబరు 30వ తేదీ వరకు రెండేళ్లు సెలవు మంజూరు చేసింది. ఈ కాలానికి ఎలాంటి జీతాలు, అలవెన్సులు చెల్లించరు. అక్కడకానీ, ఇతర విదేశాల్లో కానీ ఆమె ఎలాంటి ఉద్యోగం చేయడానికి వీలు లేదు. సౌదీ అరేబియాలో నివాసం చిరునామాను ఉన్నతాధికారులకు తెలియజేయాలని షరతులు విధిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సెలవు మంజూరు ఆదేశాలను జారీ చేశారు.

సైనిక లాంఛనాలతో మాజీ సైనికుడికి అంత్యక్రియలు



లక్ష్మిరెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మిలటరీ పోలీసులు

చాపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుపల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం మాజీ సైనికుడు మూల క్రిష్టారెడ్డి (55)కి మిలటరీ పోలీసులు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈనెల 25న గురువారం ప్రొద్దుటూరు పట్టణంలోని తన ఇంటిలో లక్ష్మిరెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతని సొంత గ్రామం చెంచుపల్లె కావడంతో అంత్యక్రియలు ఇక్కడ నిర్వహించారు. మిలటరీ సైనికులు తుపాకులతో గాలిలోకి కాల్పులు జరిపి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా, ఆయన బెంగుళూరు, జమ్మూకాశ్మీర్ ప్రాంతాల్లో 15 ఏళ్లపాటు మిలటరీలో పనిచేశారు. ఆయనకు భార్య మల్లేశ్వరి, కుమార్తెలు రవీణారెడ్డి, రస్మికారెడ్డిలు ఉన్నారు. క్రిష్టారెడ్డి మృతి వార్త తెలిసిన చెంచుపల్లె, చిన్నవరదాయపల్లె, మడూరు, అన్నవరం గ్రామాల ప్రజలు ఆయన మృతదేహాన్ని చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

కడప ఎమ్మెల్యేపై అసభ్య పదజాలంతో పోస్టింగులు పెట్టిన పలువురిపై కేసు

కడప క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిపై ఫేస్‌బుక్‌లో ఓ వీడియోను అసభ్య పదజాలాలతో కూడిన వీడియోలను పోస్టింగు పెట్టిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఎన్నికలకు ముందు పార్టీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారనే కారణంతో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి కొంతమందిని టీడీపీ నుంచి బహిష్కరించారు. వారిలో విజయలక్ష్మి ఆలియాస్ విజయారెడ్డి, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరమైన అవమానకరమైన భాషను కలిగి ఉన్న వీడియోను రికార్డు చేశారు. ఆ వీడియోను ఇస్మాయల్ బాషా అనే వ్యక్తితో పోస్టింగులు చేయించడంతో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఇస్మాయిల్ బాషాను అరెస్టు చేసి, కౌన్సెలింగు చేయడంలో పార్ట్1 నోటీసు అందించారు. మిగతా గుర్తు తెలియని వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఇరు వర్గాల మధ్య విబేధాలను రెచ్చగొట్టే విధంగా వీడియోను షేర్ చేశారని ఎమ్మెల్యే మాధవీరెడ్డి భర్త, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అసభ్యకరమైన పోస్టింగులు పెడితే రౌడీషీట్

అసభ్యకరమైన పదజలాలు, అశ్లీల వీడియోలను పోస్టింగులు చేసినా, వీడియోలు సోషల్ మీడియా వేదికలో ఇతరులకు షేర్ చేసినా వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో అసభ్య, అశ్లీల కంటెంట్ ఉన్న వీడియోలు గ్రూపుల్లో పెట్టడంతో పాటు ఇతరులకు కూడా పోస్టింగులు చేస్తున్నారని.. వీటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జమ్మలమడుగు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లె గనుల వద్ద శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు అర్బన్ సీఐ నరేష్‌బాబు సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా, మధ్యాహ్నం మృతుడి సోదరుడు సంపత్ పోలీసు స్టేషన్‌కు వచ్చి మృతదేహం తమ తమ్ముడిదేనని.. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్లితే... ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీనివాసగర్‌కు చెందిన బుడ్డాయిపల్లె శివకుమార్ (36) గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈయనకు వివాహం కాలేదు. అనారోగ్య కారణంగా మందులు వాడేవాడు. ఘటనా స్థలంలో టీబీకి సంబంధించిన మందులు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

● కుమారుడికి గాయాలు

రామాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని నల్లగుట్టపల్లి పంచాయతీ దర్గా రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటకొండ రాము (38) అనే వ్యక్తి లారీ కింద పడి మృతి చెందగా, అతని కుమారుడు జగదీశ్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ వడ్డెపల్లికు చెందిన కోటకొండ రాము తన కుమారుడు జగదీశ్‌తో కలిసి స్కూటర్‌లో రాయచోటిలోని అత్తగారింటికి వెళుతున్నాడు. మార్గమధ్యంలో రామాపురం సమీపంలో ఉన్న వైఎస్ఆర్‌కాలనీ వద్దకు రాగానే నిలబడి ఉన్న స్కూటర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జగదీశ్ రోడ్డు పక్కన పడగా, రాము అదే సమయంలో హైదరాబాదు నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ కిందపడ్డాడు. దీంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 రెండో విడత జిల్లా ఎంపికలు షెడ్యూలు ప్రకారం ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యా అధికారి, స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ అండర్ 19 సెక్రటరీ చంద్రమోహన్‌రాజు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం క్రీడా షెడ్యూలును తెలియపరిచారు. అందులో భాగంగా 27న కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ షటిల్ పోటీలు జరగనున్నాయన్నారు.

రిమ్స్‌లో శిశువులకు ఆధునిక ల్యాపరోస్కోపీ శస్త్రచికిత్సలు

● సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్



కోలుకున్న శిశువుతో సూపరింటెండెంట్, వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప (రిమ్స్) సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో పిల్లల శస్త్ర చికిత్స విభాగంలో ఆధునిక ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్సల సేవలు అందుబాటులో ఉన్నాయని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇవి సాధారణంగా మెట్రో నగరాలలో లక్షల రూపాయల ఖర్చుతో జరిగే శస్త్రచికిత్సలు అని, ఎన్‌టీఆర్ వైద్యసేవ ద్వారా సేవలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ నెల 23న రాజంపేటకు చెందిన 13 నెలల వయసు ఉన్న చిన్నారికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పైలోరిక్ స్టెనోసిస్ అనే జీర్ణాశయ సమస్యకు అరుదైన ల్యాపరో స్కోపిక్ చికిత్సను నిర్వహించారు. బాలిక పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ శిశువుల్లో పైలోరిక్ స్టెనోసిస్ అనేది ఆహారం ఆయం (ఆమాశయం) నుంచి చిన్న పేగులోకి వెళ్లే మార్గమైన పైలోరస్ కండరాల మందంగా మారడం వల్ల ఆ మార్గం బిగుసుకొని ఆహారం పేగులవైపు వెళ్లకుండా అడ్డం కావడం, అధిక వాంతులు, బరువు పెరగకపోవడం, తిన్న వెంటనే వాంతులు వీటి లక్షణాలు అన్నారు. అలాగే మూడు నెలల బిడ్డకు పెద్దదైన అండాశయ సిస్టును ల్యాపరోస్కోపిక్ కిస్టెక్టమీ ద్వారా తొలగించడం, ఒక సంవత్సరం వయసు అబ్బాయికి ఇంగ్వైనల్ హెర్నియాకు ల్యాపరోస్కోపిక్ హెర్నియోటమీ, పదేళ్ల అమ్మాయికి పిత్తాశయంలో రాళ్ల సమస్యకు ల్యాపరోస్కోపిక్ కొలిసిస్టెక్టమీ ద్వారా నయం చేశామన్నారు. ఈ శస్త్రచికిత్సలు సాధారణంగా ఓపెన్ సర్జరీగా చాలా చోట్ల జరుగుతుంటాయన్నారు. కానీ ల్యాపరోస్కోపిక్ విధానం ద్వారా చేయడం తక్కువ నొప్పితో, త్వరితగతిన కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సేవలు పిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ సుకుమార్ సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కన్యకాపరమేశ్వరికి బంగారు హారం బహూకరణ



బంగారుహారం అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

వేంపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మవారిశాలలో కన్య కాపరమేశ్వరి దేవికి బంగారు హారం బహూకరణగా అందించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, కుటుంబ సభ్యులతో కలిసి రూ.1.05 లక్షల విలువైన బంగారు హారాన్ని కమిటీ సభ్యు లకు అందించారు. ఆలయ పూజారి ఇంద్రకంటి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను శాలు వ, పూలమాలలతో సత్కరించారు.

టూరిజం సర్క్యూట్‌తో అభివృద్ధి అవకాశాలు



హెరిటేజ్ వాక్‌లో ఇంటాక్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముందస్తుగా కడప నగరవనంలో ఇంటాక్ చాప్టర్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ ఘనంగా నిర్వహించారు.కడప చాప్టర్ కన్వీనర్, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ సభ్యుడు లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అనేక కళాత్మక, సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. వీటిని కలుపుతూ ఒక సమగ్ర టూరిజం సర్క్యూట్ ఏర్పాటుచేస్తే పర్యాటక రంగం విశేషంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రంగనాథరెడ్డి, సెక్రటరీ గునిశెట్టి సాయి, జోన్ చైర్మన్ వెంకటసుబ్బయ్య, ఎకాలజిస్ట్ ఓవీరెడ్డి, రాయలసీమ టూరిజం సొసైటీ కార్యదర్శి జనార్ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికల ద్వారా పంచాయతీల అభివృద్ధి

సీకేదిన్నె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రణాళిక ద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవడం సులభంగా ఉంటుందని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో శుక్రవారం పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పనితీరు, పురోగతిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై 2.0 వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపమండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వివిధ పంచాయతీల ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో గౌస్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో పంచాయతీ పురోగతి యాప్‌పై వర్క్‌షాపు ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై ఎక్కడా నీరు నిలబడకుండా తగు జాగ్రతలు తీసుకుని వ్యాధులను నివారించాలని అన్నారు. ఎంపీటీసీ, సర్పంచ్‌లను కలుపుకుని పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర,ఉప ఎంపీపీ చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కెజియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొండపేట వంతెనపై త్వరలో వెలుగులు

చెన్నూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):దాదాపు తొమ్మిదేళ్లుగా పూర్తిస్థాయిలో వెలుగులకు నోచుకోని చెన్నూరు - కొండపేట వంతెనపై మరికొన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో వెలుగులు నింపుతామని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నూరు - కొండపేట సర్పంచ్‌లు ఎస్.వెంకటసుబ్బయ్య, తుంగ చంద్రయాదవ్ కలిసి హైలెవెల్ వంతెన పరిశీలించారు .దాదాపు ముప్పాతిక కిలోమీటరు ఉన్న ఈ వంతెనపై విద్యుత్ బల్బులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో వారు స్పందించారు. బల్బుల విషయంపై వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, కొండపేట మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, టీడీపీ నేతలు ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం గుర్రంగుంపు ప్రాజెక్టు స్టాక్‌పాయింట్‌ను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గాలేరు-నగరి ప్రాజెక్టు అంతర్భాగంగా ఉన్న గుర్రంగుంపు స్టాక్‌పాయింట్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టుల నిధుల కోసం శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులరెడ్డి, చిన్నసిద్దయ్య, రహీం, అనిపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

పంచాయతీ రికార్డులు పరిశీలించిన డీపీఓ రాజ్యలక్ష్మి

వేంపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఇంటి పన్ను చెల్లించాలనుకునే వారు తప్పకుండా ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వేంపల్లె పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. ప్రత్యేకించి పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూసుకోవాలని సూచించారు. వేంపల్లె పంచాయతీపై ప్రత్యేక నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓ నాగభూషణంరెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ప్రణాళికలు

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, మహిళలపై నేరాల అదుపునకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ అదితిసింగ్,డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కమిషనరు మనోజ్‌రెడ్డి, అధికారులు సుమతి,రాజ్యలక్ష్మీ, కిరణ్‌కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు రవికుమార్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ కటాక్షించు..

కడప కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. రంగురంగుల విద్యుద్దీపాల కాంతుల్లో అమ్మవారి ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. ప్రకృతి స్వరూపిణీ అయిన అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నగరంలో భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయాలు..: కడప నగరంలో దసరా ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు ఆలయాల బాట పట్టారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లుగావించారు. ప్రధానంగా ఆలయాల్లో భక్తుల తాకిడికి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులను వరుస క్రమంలో పంపారు.

లలితా పంచాయతన దేవాలయంలో..: దసరాఉత్సవాల్లో భాగంగా నగర శివారు ప్రాంత లలితా పంచాయతన దేవాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.

విజయదుర్గాదేవి ఆలయంలో..: బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు స్కంధ మాతదేవిగా ఐదో రోజు భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం 6గంటల నుంయి అమ్మవారు స్కంధమాతా దేవీగా భక్తులకు దర్శన మిచ్చారు. రాత్రి 8గంటలకు విజయదుర్గా మల్లికార్జునులను ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. రాత్రి 10గంటలకు అమ్మవారికి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమ్మవారిశాలలో..: అమ్మవారిశాలవీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మోహినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



విజయదుర్గా ఆలయంలో కోలాటం వేస్తున్న భక్తులు

రాజ రాజేశ్వరి ఆలయంలో..: రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీదేవి గా అలంకరించారు.

గడ్డిబజారు బాలాజీ ఆలయంలో..: గడ్డిబజారులో వెలసినలక్ష్మి సత్యనారాయణస్వామి దేవస్థానం (బాలాజీ)లో అమ్మవారు రంగనాథ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజారెడ్డివీధిలో..: రాజారెడ్డివీధిలో వెలసిన శ్రీ గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన కామకోటి కళాంబ దేవి సమేత సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎర్రముక్కపల్లెలో..: ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలితా దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. నగర శంకరాపురం ఎస్‌బీఐ సమీపంలో వెలసిన అమ్మవారి ఆలయంలో అమ్మవారు మోహినీదేవి అలంకారం,సీయోనుపురం (రాజారెడ్డివీధి)లో వెలసిన శక్తిసవారమ్మఅవ్వ దేవస్థానంలో అమ్మవారు అంబికాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నగర చిన్నబెస్తవీధిలో వెలసిన జగన్మాత బాల పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. హనుమప్ప వీధిలో వెలసిన భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారం శంకరాపురం మోహినీదేవి అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం కన్యపూజలు, లక్ష కుబేర కాయన్‌తో కుంకుమార్చన నిర్వహించారు.

చెన్నూరు..: దసరా శరన్నవరాత్రల్లో భాగంగా స్థానిక రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకారం, వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాతమ్మతల్లి దేవాలయంలో టీడీపీ నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వేంపల్లె..: వేంపల్లె అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవిని భవానిదేవిగా అలంకరించి పూజలుచేశారు.

కమలాపురం రూరల్..: అమ్మవారిశాలలో మత్యకన్యకాపరమేశ్వరిదేవి అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం పార్వతీదేవి అమ్మవారు మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.



కడప... శంకరాపురంలో మోహినీదేవి అలంకారంలో అమ్మవారు



చెన్నూరులో లలితాదేవిగా చౌడేశ్వరీదేవి



కమలాపురంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



కడప...చిన్నబెస్తవీధిగంగమ్మ తల్లి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారం





లలితా పంచాయతన దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వామి తురియానంద సరస్వతి, నడివీధిగంగమ్మతల్లి ఆలయంలో సంతానలక్ష్మి అలంకారం



కడప..అమ్మవారిశాలలో మోహినీదేవి అలంకారం

రేపటి నుంచి శిల్పారామంలో దసరా ఉత్సవాలు

పులివెందుల రూరల్,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నామని ఏఓ టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. స్థానిక శిల్పారామంలోని కార్యాలయంలో దసరా ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 28వ తేదీ, అక్టోబరు 2వ తేదీ, అక్టోబరు 5వ తేదీలలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

సమ్మెలోకి వైద్యాధికారులు

లింగాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే అంగీకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళ్తున్నట్లు లింగాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 27వ తేదీ స్వస్థ నారీ కార్యక్రమం, 104 సంచార చికిత్స సేవలు బంద్, 28న అధికారిక వాట్సప్ గ్రూప్ బహిష్కరణ, 29న పీహెచ్‌సీలో ఓపీ సేవలు నిలిపివేత, 30వ తేదీ, అక్టోబరు 1న జిల్లాలో నిరసన ర్యాలీలు, 3వ తేదీ విజయవాడలో నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసయం ద్వారా పంటలు పండిస్తే అధిక దిగుబడి లభిస్తుందని మండల వ్యవసాయాధికారి సరస్వతి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లె గ్రామంలో పొలంబడి నిర్వహించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్దతులను అనుసరించి వరి సాగును చేసినట్లయితే సాగు ఖర్చు తగ్గించుకోవ చ్చని తెలిపారు. అలాగే పంటలకు సోకే చీడపీడల నివారణపై జాగ్రత్తలు వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం కడపనగరం ఐటీఐ సర్కిల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఏబీవీపీ నాయకులు చెర్రీ, శశి,అజుమ్,కిషోర్, విష్ణు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్య ఉన్న వారికే గౌరవమర్యాదలు



యుఎస్‌ఓ ఆలిండియా స్కూల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంపద ఉన్న వారి కంటే విద్య ఉన్న వారికే సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య అన్నారు. శుక్రవారం పులివెందుల ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీ (ఇస్టా)లో యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్‌ఓ) ఆధ్వర్యంలో ఆలిండియా స్కూల్ ఫెస్ట్ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం శాస్త్రీయ నృత్యం, పెయింటింగ్స్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఓ సెక్రటరీ సీనా జైన్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుప్రకాష్, ట్రెజరర్ విజయ్ కుమార్ మెహ్రా, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సూక్తి సుధాలహరి పుస్తకావిష్కరణ

కడప కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10గంటలకు కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకుడు స్వర్గీయ ఇమాం సాహెబ్ రచించిన సూక్తిసుధాలహరి అనే పుస్తక గ్రంథాన్ని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు, పుస్తక సమీక్ష కులుగా సాహితీవేత్త భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి హాజరుకానున్నారన్నారు.

యాంటీ ర్యాగింగ్ పోస్టర్ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు యాంటీ-ర్యాగింగ్ పోస్టర్‌ను ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్ గురువారం ఆవిష్కరించారు. ర్యాగింగ్ శిక్షార్హ నేరమని,వర్సిటీలో ఈరో-టాలరెన్స్ పాలసీఅమలవుతోందని ఆయన తెలిపారు.ఘటనలు జరిగిన వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్పిఎ అధికారి మూర్తి సూచించారు. ర్యాగింగ్‌లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన గ్రామపంచాయతీ ప్రాథమిక వైద్య సేవలు అభివృద్ధి, ప్రజారోగ్యంపై దృష్టిసారించాలని ఎంపీపీ రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై అవగాహన కల్పించేకు ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేషచలపతి లక్ష్యాలు వాటిని సాధించేందుకు అవలంభించాల్సిన వ్యూహంపై పంచాయతీ సిబ్బందికి, సర్పంచులకు, కార్యదర్శులకు దిశా నిర్దేశం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

సింహాద్రిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):పర్యావరణాన్ని రక్షించుకుందామని తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మెన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా సింహాద్రిపురం పంచాయతీ సచివాలయ సముదాయం, మార్కెట్‌యార్డు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఉపాధి హామీ పీడీ ఆదిశేషారెడ్డి , ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డి, ఏపీఎం మంజునాథ్, అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ కాంగ్రెస్ ర్యాలీలో డీసీసీ అధ్యక్షురాలు

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజయవాడలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డి.విజయజ్యోతి పాల్గొన్నారు. ఈసందర్భంగా విజయజ్యోతి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధరలు కల్పించడంలో, ఉల్లి, మిరప ధరలు కుదేలు అయినప్పటికీ ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలనీ డిమాండ్ చేస్తూ ఆందోళన ర్యాలీని చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్,నియోజకవర్గ ఇన్‌చార్జులు ధ్రువకుమార్ రెడ్డి, ఇర్ఫాన్‌బాష, శివమోహన్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు చిన్న రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ కాంగ్రెస్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి

చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న నేతలు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారీ చాకలి ఐలమ్మ విగ్రహాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రతిజిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ (జేసీఐపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా రజక ఐక్యవేదిక సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో తొలుత ప్రకాశ్‌నగర్‌లోని జేసీఐపీ కేంద్ర కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం నగర పురవీధుల గుండా కలెక్టరేట్, మహవీర్ సర్కిల్, తిరిగి కలెక్టరేట్ చేరుకుని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేసీఐపీ నగర అధ్యక్షుడు గున్నా జయరాములు, బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణ, ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు, ఎంఆర్‌పీ అధ్యక్షుడు సంగటి మనోహర్, జనతాదళ్ రాష్ట్రనాయకుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా నాటి దొరల పాలనకు చరమగీతం పలికిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రజక సంఘం కార్యదర్శి మచ్చయ్యగారి మల్లయ్య, జిల్లా రజక సంఘ అధ్యక్షులు చేలో రవి కొనియాడారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని జిల్లా రజక సంఘం కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం నాయకులు క్రిష్ణమూర్తి, మల్లయ్య, ఎరికలయ్య, వెంకట్రావు, క్రిష్ణ, చెన్నప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీ.. లోకపావని



ప్రొద్దుటూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వనవిహారిణి, చెన్నకేశవ ఆలయంలో మోహిని వనవిహారిణి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు జగజ్జననీ.. లోకపావని అయిన అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో మధ్యాహ్నం శ్రీదేవి వనవిహారిణిగా, రాత్రికి పార్వతీదేవిగా దర్శనమివ్వగా, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి వనవిహారిణిగా భక్తులను కరుణించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు భక్తులను ఆకట్టుకున్నాయి. చెన్నకేశవస్వామి ఆలయంలో మోహిని వనవిహారిణిగా, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, వైఎంఆర్ కాలనీలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పార్వతీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. గౌరమ్మ కట్టవీధిలో వనవిహారిణిగా, సత్యనారాయణస్వామి ఆలయంలో వైష్ణవీదేవి అలంకారం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో దసరా శరన్నవరాత్రుల 5వరోజు శ్రీమత్కన్యకాపరమేశ్వరీదేవి రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని కన్యతీర్థంలో బాలత్రిపురసుందరీదేవి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు అమ్మవారిశాలలో శుక్రవారం అన్నపూర్ణాదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బల్లాని చెన్నకేశవ ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం దసరా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

బద్వేలుటౌన్‌లో : పట్టణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు . 5వ రోజు అమ్మవారు వాసవీకన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో వెలసిఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా, కోదండరామస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో, మహాలక్ష్మీదేవి ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో, భద్రకాళీసమేత వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

పోరుమామిళ్లలో: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోరుమామిళ్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారిని వనవిహారినీ అలంకారంగావించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఎర్రగుంట్లలో: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఎర్రగుంట్ల మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో వాసవాంబ శ్రీదేవి వనవిహారిణీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏరువాక గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా చౌడేశ్వరీదేవి ఆలయంలో లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

కాశినాయనలో: దసరా ఉత్సవాలల్లో భాగంగా 5వ రోజు నర్సాపురంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం, ఆర్యవైశ్య వీధిలోని శివాలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

దువ్వూరులో: దువ్వూరులో శుక్రవారం లలితాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. స్థానికాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్యులు అమ్మవారిని పురవీధుల మీదుగా మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో తీసుకెళ్లారు.

ఖాజీపేటలో: శ్రీ మత్కక న్యకాపరమేశ్వరీదేవి ఆలయంలోపార్వతీ వనవిహారిణి అలంకారంలో దర్శనమివ్వగా, సాయంత్రం అన్నపూర్ణాదే అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. కాగా అమ్మవారిశాలలో అమ్మవారిని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలసపాడులో: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారు వనవిహారిణిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కుకున్నారు.



ప్రొద్దుటూరు గౌరమ్మకట్ట వీధిలో వనవిహారిణిగా అమ్మవారు



ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి

బ్రహ్మంగారిమఠంలో: మండలకేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం వనవిహారినీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధ్యక్షుడు అయ్యావు వెంకటసురేశ్‌బాబు, కార్యదర్శి నుంకు సురేశ్‌బాబు, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, యువజన సంఘ అధ్యక్షులు యాదాళ్ల వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో కమిటీ సభ్యులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



బి.మఠంలో వనవిహారిణిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు పాల్గొన్న ఉత్సవ నిర్వాహకులు



బద్వేలు చెరుకుతోటలో రాజరాజేశ్వరిదేవి గా అమ్మవారు



మైదుకూరులో అన్నపూర్ణ దేవి అలంకారంలో అమ్మవారు



కాశినాయన శివాలయంలో పార్వతీదేవిగా అమ్మవారు



పోరుమామిళ్లలో వనవిహారిణీదేవి అలంకారంలో అమ్మవారు

మహిళా ఆరోగ్యమే కుటుంబానికి సౌభాగ్యం

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటిలోని మహిళా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే కుంబానికి సౌభాగ్యమని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సోములవారిపల్లె పంచాయతీలోని సచివాలయం-2లో స్వస్త్‌నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, పాల్గొన్నారు.

బద్వేలు రూరల్‌లో: స్వస్తినారీస్వశక్తిపరివార్ అభియాన్ వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి కోరారు. శుక్రవారం బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ, క్యాన్సర్ స్క్రీనింగ్, పోషకాహారం, జాతీయ కీటక జనిత వ్యాధి కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్లు కె.వినయ్‌కుమార్, సౌమ్య, సుమన్, శివలత, పాల్గొన్నారు.

ఇకపై విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఉండదు

కాశినాయన సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నర్సాపురం ప్రాంత రైతులకు ఇకపై లోఓల్టేజీ సమస్యలేకుండా నాణ్యమైన విద్యుత్ అందుతుందని ట్రాన్స్‌కో ఈఈ రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనంగా 5 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను ఈఈ ప్రారంభించారు. రైతులు విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ రవిచంద్ర, ఏఈఈలు వీరయ్య బ్రహ్మానందరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

బద్వేలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోదురాలు చిట్యాల చాకలి ఐలమ్మ 130వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్‌జీవో హోంలో మహనీయుల ఆశయాల సాధన సమితి ఆధ్వర్యంలో పలువురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా సావిత్రిబాయి, మహాత్మ జ్యోతిరావు పూలే ల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం సామాజిక సేవా కార్యకర్తలైన గనమంతు రాజేష్, ప్రభల వీటి వెంకటరమణలను ఘనంగా సన్మానించారు. సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు సామాజిక సభ్యులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేయించుకోవాలి

బి.కోడూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి మహిళ ప్రభుత్వ వైద్యశాలల్లోనే చికిత్స చేయించుకోవాలని సర్పంచ్ గోడి లక్ష్మీదేవి, వైద్యాధికారి ఉదయకిరణ్‌లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తంగేడుపల్లె గ్రామ పంచాయతీలో స్వస్తనారీ స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రక్తపోటు మధుమేహం క్యాన్సర్ తదితర వ్యాధులకు ముందుగానే గుర్తించడం, టీబీ పరీక్షలు, తదితర వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



సీఎంను కలిసిన సర్పంచ్ సుధాకర్

పోరుమామిళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మేజరు పంచాయతీ సర్పంచ్ సుధాకర్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును కోరారు. శుక్రవారం ఆయన విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిం చినట్లు సర్పంచ్ తెలిపారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

చాపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందేందుకు ప్రణాళికలు ముఖ్యమైనవని ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీవో వీరకిశోర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల పురోగతిపై 2.0 పైశిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామస్థాయిలో . తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, తరగతి గదులు, వ్యవసాయ కూలీలకు పనులు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ వంటి వాటిపై ప్రణాళికలను అధికారులు తయారు చేయాలన్నారు. సమావేశంలో మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంగమునిరెడ్డి

అట్లూరులో: అట్లూరు మండలంలోని పంచాయతీల పురోగతిపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలలో ఎంపీడీవో వెంగమునిరెడ్డి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 12 గ్రామ పంచాయ తీలకు 15 వ ఫైనాన్స్ నిధులు రూ.53 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని అలాగే మండల ఎంపీపీ గ్రాంటు రూ.15లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈనిధులను గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీలు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కాశినాయనలో: గ్రామ పంచాయతీల పురోగతి చూచికలపై శుక్రవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో మండల స్థాయి అధికారులకు సర్పంచ్‌లకు, పంచాయతీ సెక్రటరీలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మైథిలీరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్నిశాఖల అధికారులు సర్పంచ్‌లు పంచాయతీ సెక్రటరీలు సమన్వయంతో పనిచేసినప్పుడే పల్లెలు ప్రగతి పంథంలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నిర్మల, డీటీ రవిశంకర్, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రాజుపాలెంలో: పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు నీరు, ఆరోగ్యం పరిసరాలు పరిశుభ్రత తదితర అంశాలపై శుక్రవారం మండల ప్రజాపరిషత్ సభాభవనంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీవో షాకిర్‌ఆలీఖాన్ తొమ్మిది అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులుపాల్గొన్నారు.

కొండాపురంలో: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల పురోగతిపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎంపీడీవో నాగప్రసాద్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీవో నాగప్రసాద్ , అధికారులు పాల్గొన్నారు.

ముద్దనూరు లో:గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో రాధాకృష్ణవేణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో శుక్రవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు చేయాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్రాల బాట ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజులకాలం నాటి గుర్రాలబాట ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నీటి సంఘం చైర్మన్ చెరుకూరి వీర చెంద్రాయుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 193 సర్వేనెంబరులో కొంతమంది గృహ నిర్మాణం చేపడుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. శుక్రవారం కొందరు అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్న విషయం తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ అక్రమ కట్టడాలు కడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో వారు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పుట్టా



మైదుకూరు సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి)అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 7వ రోజు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని మైదుకూరు ఎంఎల్ఏ పుట్టా సుదాకర్ యాదవ్ కోరారు. మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాల, బ్రహ్మంగారిమఠం నవోదయ పాఠశాలల సమస్యలను అసెంబ్లీలో ఆయన ప్రస్తావించారు. మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో బోధనా సిబ్బంది పూర్తిగా ఉన్నా సొంత భవనాలు లేక, ఇరుకైన అద్దె భవనాలలో సౌకర్యాలు లేకపోవడంతో 540 మంది చదువుకునేందుకు అవకాశం ఉన్నా కేవలం 120 మంది మాత్రమే ఉన్నారన్నారు. ప్రభుత్వం సొంత భవననిర్మాణాలు చేపట్టాలని కోరారు. అలాగే బ్రహ్మంగారిమఠంలో మంజూరైన నవోదయ పాఠశాలకు సంబంధించిన ప్రతిపాదనలను మంత్రి ఆదేశాల మేరకు పంపినాకూడా ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. అక్కడే ఖాళీగా ఉన్న గురుకులం పాఠశాల గదులను కేటాయించి పాఠశాలలో అడ్మిషన్స్ జరిగేలా అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఇందుకు మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం కేటాయింపు జరిగిందని, దీంతో పాటు అన్ని చోట్లా స్థలం కేటాయించిన తర్వాత కేంద్రం సహాయంతో సంప్రదింపులు జరిపి త్వరలో పూర్తి చేస్తామన్నారు.

పారిశుధ్య కార్మికులే మన ఆరోగ్య పరిరక్షకులు



కాలువలోని చెత్తను తొలగింపును పర్యవేక్షిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి, డీఎల్‌పీవో నూర్జహాన్

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెత్తసేకరణ చేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులే మన ఆరోగ్య ప్రధాన పరిరక్షులు అని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్వచ్ఛతాహి సేవ-2025 కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలో డీపీవో రాజ్యలక్ష్మి, జమ్మలమడుగు డీఎల్‌పీవో నూర్జహాన్ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు చెత్తను రోడ్లపై, మురుగు కాలువల్లో పడవేయకుండా తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించి సహకరించాలని కోరారు. పారిశుధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా మైదుకూరు రోడ్డులోని ప్రధాన రహదారికి ఇరువైపుల మురుగు కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాలను పారిశుధ్య కార్మికులతో కలిసి డీపీవో, డీఎల్‌పీవో చెత్తను తొలగించారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేలా అన్ని సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఖాదర్‌బాద్ సచివాలయ పరిధిలో ఉన్న విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లో కార్మికులకు వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ శివచంద్రారెడ్డి సమకూర్చిన కార్మికుల యూనిఫాం, గ్లౌజ్‌లు తదితర సామాగ్రిని డీపీవో రాజ్యలక్ష్మి, డీఎల్‌పీవో నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయుల రెడ్డి అందించారు.

'మాజీ ఎమ్మెల్యే రాచమల్లుపై కేసు నమోదు చేయాలి'

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలుతీసుకోవాలని వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక త్రీటౌన్ సీఐ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టీడీపీ నేతలైన నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఈవీసుధాకర్ రెడ్డిల ఫొటోలు పెట్టి వారిని జంతువుల బొమ్మలతో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి కించపరిచే వ్యాఖ్యలు చేశారన్నారు. సీఐని కలిసిన వారిలో టౌన్ బ్యాంకు చైర్మన్ సుబ్బారెడ్డి, టీడీపీ నేత చెన్నయ్య తదితరులు ఉన్నారు.

కాలుష్యాన్ని కొలిచిన అధికారులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో నెలకొన్న కాలుష్యాన్ని కొలిచేందుకు ఏర్పాటు చేసిన యంత్రాల నుంచి కాలుష్యాన్ని అధికారులు శుక్రవారం పరిశీలించారు. ప్రతి 8 గంటలకోమారు పిల్టర్స్‌ను మార్చి ఈ కాలుష్యాన్ని కొలుస్తామని వారు తెలిపారు. ల్యాబ్‌లో ఫిల్టర్ పేపర్‌పై ఉన్న కాలుష్యాన్ని తూకం వేయడం ద్వారా ఎంత శాతం కాలుష్యం ఉండేది తెలుస్తుందన్నారు. తెల్లగా ఉన్న పేపర్ నల్లగా మారిపోయిందని దీని ద్వారానే ఇక్కడ భారీగా కాలుష్యం ఉన్నట్లు భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కౌన్సిలర్ ఎరికలరెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రజల ప్రాణాలను దృష్టిపెట్టుకుని వ్యవహరించాలన్నారు. కాలుష్యనివారణమండలి నుంచి (అనలిటికల్ స్టాఫ్) ప్రదీప్, గోపాల్‌లు చెక్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీర్చాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీర్చాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్‌లు కోరారు. శుక్రవారం సీపీఐ బృందం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 పడకల ఆసుపత్రికి బెడ్లు అన్నీ ఖాళీగా ఉన్నాయని, చిన్నపిల్లల ఇంక్యుబేటర్లలో ఒక చంటి బిడ్డ కూడా గంట ఉంచిన దాఖలాలు లేవన్నారు. ఆసుపత్రిలో 13 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఐదుమంది మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యులను నియమించి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలని కోరారు.

దసరా సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యలో భాగంగా విద్యార్థులకు దసరా సెలవుల్లో ఇంటర్నల్ షిప్‌లో శిక్షణ ఇస్తున్నారని వృత్తి విద్యాబోధకుడు శ్రీనివాస్ తెలిపారు. ఏపీ మోడల్ స్కూలు, నరసాపురంలోని విద్యార్థినీ, విద్యార్థులకు పోరుమామిళ్లలోని గ్రామ సచివాలయం-1, సచివాలయం-2లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వారిలో పదిమందికి టైలర్స్ శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

ముస్లిం కమ్యూనిటీ హాలు వీధిలో నీటి వసతి కల్పించండి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎ ముస్లిం కమ్యూనిటీ హాలు వీధిలో ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు కోరారు. శుక్రవారం సంఘం నాయకులు మాట్లాడుతూ కేవలం 15-20 నిమిషాలు మాత్రమే నీళ్లు వస్తున్నాయని దీని వలనప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను తొలగించడానికి వీధిలో పైపు లైను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌చార్జి ఆయూబ్‌ఖాన్, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, కార్యదర్శి రఫి, ముక్తియార్, అల్లాబకాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

ఖాజీపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికోసం తన వంతు కృషి చేస్తానని గ్రంథాలయ డైరెక్టర్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెముళ్లపల్లెలో అర్థాంతరంగా ఆగిపోయిన లైబ్రరీ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవతో నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం సచివాలయంలో ప్రజలకు డిజిటల్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. అలాగే రావులపల్లె పంచాయతీలో ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాదనాగేశ్వరకోన చైర్మన్ ఆది నారాయణరెడ్డి, ప్రజలకు డిజిటల్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండపేట కేసీకెనాల్ చైర్మన్ రవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు చంద్ర ఓబులు, శ్రీనివాసులు, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూజా ఇంటర్నేషనల్ స్కూలులో విద్యార్థులకు విద్యాబోధన చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో శోభారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి పాఠశాల సక్రమంగా సాగడం లేదన్నారు. కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు బోధన చేయడంలేదన్నారు. 10వ తరగతి విద్యార్థులకు త్వరగా పరీక్షలు జరుగుతాయని, దీని వలన ఆ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పాఠశాల యాజమాన్యంపై తమకు నమ్మకం లేదని తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టీసీలు ఇప్పించాలని, తాము చెల్లించిన ఫీజులను వెనక్కు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.